ఫుట్‌పాత్ పనుల నిలిపివేత

సాక్షి ఎఫెక్ట్..


ఫుట్‌పాత్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురంలో పోలీస్‌స్టేషన్ సమీపంలో మసీదు మార్గంలో కొన్నేళ్ల క్రితం అవసరం లేకున్నా ప్రత్యేక నిధుల పేరుతో రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు.అవసరం లేని చోట ఫుట్‌పాత్‌ల నిర్మాణాలు చేపట్టి ప్రజాధనం వృథా చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వచ్చారు. దీనిపై ఈ నెల 20న 'ప్రజాధనంరోడ్ల పాలు' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి స్పందించారు. సోమవారం స్థానికులతో కలిసి వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్–ఎన్జీవోస్ కాలనీ రోడ్డులో కొనసాగుతున్న ఫుట్‌పాత్ పనులను ఆయన పరిశీలించారు. అసలే ఇరుకుగా ఉన్న రోడ్డులో ఫుట్‌పాత్‌ల నిర్మాణంలో రోడ్డు మరింతా కుంచించుకుపోతుందని, తవ్వకాలతో డ్రైనేజీ వ్యవస్థ ధ్వంసమవుతోందని వెంటనే పనులను నిలిపివేయాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ పరిధి వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్లలోకి వస్తున్నందున బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ అధికారులు, స్థానికులలో మంగళవారం సమావేశమై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి


ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నాగోలు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో, కామరెడ్డి బీసీ డిక్లరేషన్ వాగ్దానం ప్రకారం ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చేందుకు కృషి చేయాలని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నగర నాయకులు సోమవారం ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, బొగ్గారపు దయానంద్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముదిరాజ్‌ల స్థితిగతులను పరిశీలించి బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి జీఓ15/2009 ద్వారా మార్చిన విషయం అందరి తెలిసిందే అన్నారు. పలు కారణాలతో మధ్యలోనే నిలిచిపోయిన జీఓ 15ను తక్షణమే పునరుద్ధరణ చేయాలని కోరారు. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం ప్రతి ఏడాది రూ. 1000 కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో ప్రకాష్ ముదిరాజ్, రాజపతి ముదిరాజ్, నాగరాజ్ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, దేవేందర్ ముదిరాజ్, శంకర్ ముదిరాజ్, ప్రకాష్ ముదిరాజ్, విజయ్‌ముదిరాజ్, తిరుపతి ముదిరాజ్, సంపత్ ముదిరాజ్ పాల్గొన్నారు.

విద్యాశాఖకు 15 శాతం నిధులు కేటాయించాలి

సైదాబాద్: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో విద్యాశాఖకు 15 శాతం నిధులు కేటాయించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక సైదాబాద్ మండల కార్యదర్శి షేక్ మహమూద్ డిమాండ్ చేశారు. సోమవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని గిరిజన సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన బాల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన విద్యాశాఖకు బడ్జెట్‌లో 15 శాతం నిధుల కేటాయింపు హామీని అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా అభివృద్ధి చేయాలని అన్నారు. ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి తరగతుల వారీగా ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రతినిధులతో కలిసి ప్లకార్డులను ప్రదర్శించారు. సమావేశంలో కృష్ణగౌడ్, శంకర్‌నాయక్, అంజయ్య, నర్సింగ్‌రావు, విజయ్, కిరణ్, సుకూర్ పాషా, అలివేలు, సంతోష, సాయిలక్ష్మి పాల్గొన్నారు.


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తా


కాలనీవాసులతో చర్చిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధి శివం హిల్స్‌కాలనీలోని పార్కు స్థలంలో రూ.2.90 లక్షలతో నూతన బోర్‌వెల్ పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాలనీల్లోని పార్కు స్థలాల్లో పార్కు స్థలమని బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పార్కు స్థలాలు కబ్జా చేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారామ్, కాలనీవాసులు కృష్ణారెడ్డి, రత్నాకర్, శ్రీనివాస్‌రెడ్డి, ముకుందరెడ్డి, మోహన్‌రెడ్డి, సుధాకర్, రామలింగారెడ్డి, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, ఎల్లారెడ్డి, కదారి యాదగిరి యాదవ్, పారంద సాయి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నాగోలు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కొత్తపేట బచ్‌పన్- అకడమిక్ హైట్స్ పాఠశాల డైరెక్టర్ జితేంద్రదేవి అన్నారు. కొత్తపేట మోహన్‌నగర్‌లోని పాఠశాలలో సోమవారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జితేంద్రదేవి మాట్లాడుతూ.. మొక్కలు నాటడం బాధ్యతగా భావించి ఖాళీ స్థలాలు, ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచాలన్నారు. ఒకప్పుడు ఎటు చూసినా పచ్చదనం ప్రకృతి అందాలు, కనిపించేవని ప్రస్తుతం అవి కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ మన ప్రాంతంలో ప్రకృతిని తీసుకురావడానికి వనమహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంన్‌చార్జి స్వీటీ, ఉపాధ్యాములు, విద్యార్థులు పాల్గొన్నారు.


వనమహోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గుబులు పుట్టిస్తున్న కేబుళ్లు


కర్మన్‌ఘాట్ ప్రధాన రహదారిలో వేలాడుతున్న విద్యుత్ కేబుళ్లు


రాఘవేంద్ర కాలనీలో చేతికందే ఎత్తులో జంక్షన్ బాక్స్, నేలపై పడిఉన్న తీగలు


కటకోనికుంటలో విద్యుత్ స్తంభానికి ఇలా..

చంపాపేట: అసలే వర్షాకాలం.. అందులో బోనాల సందడి.. ప్రతీ కాలనీలో వేలాడే కేబుళ్లు, విద్యుత్ తీగలతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముందే శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలకు ఇష్టానుసారంగా కేబుళ్లను చుడుతుండటంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని బస్తీ, కాలనీలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంపాపేట డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్, శుభోదయ, కటకోనికుంట, నెహ్రూనగర్, నేతాజీనగర్, మారుతీనగర్, యాదగిరినగర్ కాలనీలలో ప్రైవేట్ ఇంటర్నెట్, సీసీ కెమెరాలు, వివిధ సంస్థలకు చెందిన కేబుళ్లను కట్టలు కట్టలుగా చుట్టి పెడుతున్నారు. చేతికందే ఎత్తులో తీగలు, కేబుళ్లు ఉండటంతో ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. లారీలు, ట్రక్కులు ప్రయాణించే సమయంలో కేబుల్ వైర్లు విద్యుత్ వైర్లతో కలిసి మంటలు చెలరేగటంతో పాటు అవి తెగి రహదారిపై వేలాడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారుతున్న విద్యుత్ తీగలు, కేబుళ్లపై దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది..



మా కాలనీలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరింది. కేబుల్ వైర్ల బరువుతో విద్యుత్ స్తంభం ఓ వైపు ఒరిగే ప్రమాదం ఉంది. కొన్ని వైర్లు తెగి రోడ్డుపై పడుతున్నాయి. ఏది విద్యుత్ వైరో.. ఏదీ కేబుల్‌లో తెలియని పరిస్థితి. బైక్‌పై వెళ్లేటప్పుడు మెడకు చుట్టుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. – ఎరవెల్లి శివకుమార్‌చారి, కటకోనికుంట

చర్యలు తీసుకుంటాం..

చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో విద్యుత్ స్తంభాలకు ప్రమాదకరంగా ఉన్న కేబుళ్లను ఇప్పటికే గుర్తించాం. కొన్నింటికే అనుమతులు ఉన్నాయి. అనుమతులు లేని వాటికి త్వరలో నోటీసులు ఇచ్చి తొలగిస్తాం. వర్షాకాలంలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా వేలాడే తీగలను సరిచేశాం. చెట్లకొమ్మలనూ తొలగించాం. విద్యుత్ సిబ్బందిని కాలనీవాసులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నాం.
– రాజేందర్, చంపాపేట ఏడీఈ

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు టమాట రూ. 50, వంకాయ రూ. 23, బెండ రూ. 23, పచ్చిమిర్చి రూ. 45, కాకర రూ. 32, బీర రూ. 18, క్యాబేజి రూ. 23, ఫ్రెంచి బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 35, దొండ రూ. 28, చిక్కుడు రూ. 65, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 23, క్యాప్సికం రూ. 50, ఆలు రూ. 38, దోస రూ. 15, సొర రూ. 9, పొట్ల రూ. 8, ఉల్లిగడ్డ రూ. 34, చామగడ్డ రూ. 35.

రేణుశ్రీకి మెరుగైన వైద్యం అందించాలి

నాగోలు: కొత్తపేటలోని శ్రీచైతన్య కాలేజీ చదువుతున్న గిరిజన విద్యార్థిని రేణుశ్రీకి మెరుగైన వైద్యం అందించాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గాంధీనాయక్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి కారణమైన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకొని కాలేజీ గుర్తింపు రద్దు చేయాలన్నారు.

వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ తప్పకుండా తీసుకోవాలి


గోవింద్‌రెడ్డి

మలక్‌పేట: వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ తప్పకుండా తీసుకోవాలని జీహెచ్ఎంసీ సర్కిల్–6, అసిస్టెంట్ లైసెన్స్ ఆఫీసర్ (ఏఎల్ఓ) గోవింద్‌రెడ్డి అన్నారు. మలకపేట కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో కమర్షియల్ టాక్స్ చెల్లించే భవనాలు ఉన్నాయని, వాటిలో వ్యాపార సంస్థలు నడుపుతున్న వారు తప్పకుండా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ట్రేడ్ లైసెన్స్ లేనివారికి అవగాహన కల్పించి లైసెన్స్ జారీ చేసినట్లు తెలిపారు. విద్యాసంస్థలు, వాణిజ్య, వ్యాపార సంస్థలు, ఆసుపత్రులు, ప్రైవేట్ బ్యాంకులు, కమర్షియల్ షాపులు, ప్రైవేట్ హాస్టళ్లు, హోటళ్ల నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని లేకుంటే నోటీసులు జారీచేసి సంస్థలను సీజ్ చేస్తామన్నారు.

ఆక్రమణల కూల్చివేత


ఆక్రమణలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధిలోని బొమ్మలగుడి నుంచి స్వాతి రెసిడెన్సీ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను సోమవారం టౌన్‌ప్లానింగ్ సర్కిల్ అధికారులు కూల్చివేశారు. రోడ్డు ఆక్రమణలతో రహదారి ఇరుకుగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు టౌన్ ప్లానింగ్ ఏసీపీ పావని ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టారు. సందర్భంగా టౌన్‌ప్లానింగ్ టీపీఎస్ మన్సూర్ మాట్లాడుతూ.. రోడ్లను ఆక్రమించి నిర్మాణం చేయరాదని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. రోడ్డుపై ర్యాంపులను నిర్మించొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది మహేందర్, పాషా, సాయి పాల్గొన్నారు.

ఆదర్శ బడులుగా తీర్చిదిద్దేందుకు కృషి

కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్‌ఆర్


మల్లాపూర్‌లోని పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న కేఎల్‌ఆర్

బడంగ్‌పేట్: చదువుంటే సంఘంలో వ్యక్తి తన సమస్యను తానే పరిష్కరించుకుంటాడని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. అందుకే ప్రభుత్వ బడులను సమస్యలు లేకుండా తీర్చిదిద్దుతున్నామన్నారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ప్రధానోపాధ్యాయులతో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేఎల్‌ఆర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యా విధానంపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బడంగ్‌పేటలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలకు వచ్చినప్పుడు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం రూ.98 కోట్లు మంజూరు చేసిందన్నారు. అందులో భాగంగానే కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఏఏ వసతులు కావాలో తెలుసుకుని వారం రోజుల్లో రిపోర్ట్ ఇవ్వడానికి తనతో పాటు మేయర్ పారిజాతరెడ్డిని నియమించారని తెలిపారు. ప్రతి పాఠశాలలో అదనంగా టాయిలెట్లు, స్కావెంజర్ల నియామకం, పాఠశాల పరిశుభ్రత చేసే ఆయాల నియామకం అవసరం ఉందని తేలిందన్నారు. మేయర్ పారిజాత మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో స్కావెంజరన్లు నియమించేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో కౌన్సిల్ తీర్మానం చేసి రూ.25 లక్షల టెండర్లు పాస్ చేశామని అన్నారు. ఎవరూ రాకపోవడంతో ఆగిపోయినట్లు వెల్లడించారు. త్వరలో టెండర్‌లు పూర్తి చేసి పాఠశాలల్లో పరిశుభ్రత ఉండేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏంఈవో కృష్ణ, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గ పరిధి ఆర్‌కేపురం డివిజన్, ఎన్టీఆర్‌నగర్ ఫేస్–3లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పనులను వేగవంతం చేయాలన్నారు. ఎక్కడైనా అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోతే వెంటనే వాటిని ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. విద్యుత్ స్తంభాలు, తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా త్వరలో ప్రతిపాదనలు పెట్టి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు సంబంధిత అధికారులు సకాలంలో స్పందించాలన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన పరికరాలు అందించాలి


సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

నాగోలు: సెల్‌ఫోన్ వినియోగదారులకు నాణ్యమైన పరికరాలు అందించి వారి మన్ననలను పొందాలని దిల్‌సుఖ్‌నగర్ జోన్ మొబైల్ షాప్ అసోసియేషన్ అధ్యక్షులు వంశీరాజ్ అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేట మారుతినగర్ కొత్తపేట మహిళా భవనంలో సోమవారం వంశీరాజ్ అధ్యక్షతన దిల్‌సుఖ్‌నగర్ జోన్ మొబైల్ షాప్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగ దారులకు సంతృప్తికరమైన సేవలు అందించడంతో పాటు వస్తువుల యొక్క నాణ్యతను పాటించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్, ఇతర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం


పనుల ప్రారంభోత్సవంలో మేయర్ పారిజాత, నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లోని శ్రీవిద్య టౌన్‌షిప్ ఫేస్–3లో సీసీ రోడ్డు, డ్రైనేజీలను సోమవారం మేయర్ చిగురింత పారిజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని డివిజన్ల అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, ఏఈఈ బిక్కునాయక్, కాలనీవాసులు ప్రభాకర్‌రెడ్డి, సింహారెడ్డి, థామస్, అశోక్‌రెడ్డి, వెంకట్‌రావు, గోపాల్‌నాయక్, సోమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా నర్సింహాగౌడ్


నర్సింహాగౌడ్

మహేశ్వరం: బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా మండలంలోని మంఖాల్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కొనమోని నర్సింహాగౌడ్ సోమవారం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నర్సింహాగౌడ్ మాట్లాడుతూ.. మండలంలో బీజేపీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల సమస్యలపై నిరంతరం పోరాడుతానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను అన్ని రంగాల్లో అణచివేస్తుందన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పటి వరకు నెరవేర్చకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. తనపై నమ్మకంతో ఈ పదవీని అప్పగించిన రాష్ట్ర, జిల్లా నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి

మహేశ్వరం: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని రావిర్యాలలో వన మహోత్సవంలో భాగంగా పండ్లు, పూల మొక్కలను కమిషనర్ వెంకట్రామ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కలతో పండ్లు, పూలు, ఔషధాలు, కలప, స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. మొక్కలు పెంచి భవిష్యత్ తరాలకు భరోసా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యాదగిరిరెడ్డి, ఏఈ భార్గవ్‌రెడ్డి, వార్డు ఆఫీసర్లు ప్రవీణ్‌రెడ్డి, నిరంజన్, బిల్ కలెక్టర్ హేమలత పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి


కమిషనర్ శైలజకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

చాదర్‌ఘాట్: సోషల్ మీడియాలో దివ్యాంగులను కించపరిచేలా పోస్ట్ చేసిన ఐఏఎస్ అధికారిణిని స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి వైస్ చైర్మన్ అందె రాంబాబు డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం ఆయన సంఘం ప్రతినిధులతో కలిసి కమిషనర్ శైలజకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దివ్యాంగుల రిజర్వేషన్ల గురించి మాట్లాడటం అంటే భారత రాజ్యాంగాన్ని కించపరిచినట్లేనని అన్నారు. నకిలీ ధ్రువపత్రాలు ఉన్నవారికి ఇలాంటి అధికారులు మద్దతిస్తున్నారా అని ప్రశ్నించారు. నిబంధనలు ఉల్లంఘించి మాట్లాడిన అధికారిణిని వెంటనే బర్తరఫ్ చేయాలని లేకుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. వినతి ఇచ్చిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, కోర్ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, తదితరులు ఉన్నారు.

క్షమాపణలు చెప్పాలి..


పద్మావతి

చాదర్‌ఘాట్: ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన పోస్ట్ వికలాంగుల మనోభావాలను దెబ్బతీసాయని వెంటనే ఆమె వికలాంగుల సమాజానికి క్షమాపణలు చెప్పాలని దివ్యాంగ కళాకారిణి పద్మావతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కుతో ఎందరో వికలాంగులు నేడు ఉన్నతస్థాయిలో ఉన్నారని స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు వికలాంగుల ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపిస్తున్నాయన్నారు. ఐఏఎస్ హోదా ఉండి ఇలా దివ్యాంగులను చులకన చేసి మాట్లాడటం సరికాదని వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు.

బాక్స్ డ్రెయిన్‌తో ప్రమాదం.. చెత్తతో దుర్గంధం





హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారంలో అధికారలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయా కాలనీలవాసులు ఆరోపిస్తున్నారు. సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీలోని కేకే గార్డెన్స్‌కు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన బాక్స్ డ్రెయిన్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయని వాపోతున్నారు.

◆ సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీలోని పార్కులో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్గంధం మారింది. పేరుకుపోయిన వ్యర్థాలోంచి దుర్వాసన వచ్చి రోగాలబారిన పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.